క్లుప్తంగా

బీజేపీలోకి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

బెజ్జూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన జాడి దిగంబర్ శుక్రవారం బీజేపీలో చేరాడు. ఈ సందర్భంగా ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రతిఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సపవాత్ భిక్షపతి, గురునాథ మురళి గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ తాళ్ల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుండడంతో గ్రామీణ రహదారులకు మహర్దశ కలుగుతుందని కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని కుంచవెల్లి నుంచి బామానగర్‌కు రూ.45లక్షలు ఎస్‌డీఎఫ్ కింద మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.35లక్షలతో కుంచవెల్లి, కల్వాడ, బామానగర్ గ్రామాల్లో మంజూరైన డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, నాయకులు రౌతు రాజన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి పోటీలు

తిర్యాణి: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్ష ఏక్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర స్వామి తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు.

గుడుంబా స్థావరాలు ధ్వంసం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని ఆరెగూడ, మోసం గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై శుక్రవారం దాడి చేసి చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీ చేసేందుకు సిద్ధం చేసిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అదేవిధంగా నాగంపేట శివారు నుంచి మోసం గ్రామం వైపునకు ఐదు లీటర్ల గుడుంబాతో వెళ్తున్న సుంకె భీంరావును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండలంలోని నంబాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

బెజ్జూర్: సుడి దోమ నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయ విస్తరణ అధికారులు రవితేజ, మారుతి అన్నారు. శుక్రవారం మండలంలోని ముంజంపల్లి, మర్తిడి గ్రామాల్లో వరి పంట క్షేత్ర సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.

12 నుంచి రుణమాఫీ

బెజ్జూర్: బెజ్జూర్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో 2018లో సంఘం వద్ద రుణం తీసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఈనెల 12న రుణమాఫీ చేయనున్నట్లు సహకార సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి సంజీవ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పనులు పూర్తి చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: వర్షపు నీరు నిల్వ చేసే నీటి కుంటలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని చింతగూడ, రాంనగర్ గ్రామాల్లో నీటి నిల్వ కుంటల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ధేత గడువులోగా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీవో సురేఖ పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ కేటాయించాలి

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ టికెట్‌ను మాలీలకు కేటాయించాలని ఆ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌత్రే గోపాల్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆ సంఘ భవనంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి తీర్మానం చేశారు. సమావేశంలో మాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ సొసైటీ బ్యాంకులో రుణమాఫీ లబ్ది పొందని రైతులతో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని సొసైటీ బ్యాంకులో దాదాపు 900 మంది రైతులకు ఇంకా రుణమాఫీ జరగలేదని తెలిపారు. సొసైటీలో అవినీతి కారణంగా రుణమాఫీ అకౌంట్లను బ్యాంకు ఉన్నతాధికారులు స్తంభింపజేశారని ఆరోపించారు. సొసైటీ బ్యాంకు వద్ద ఉదయం 11గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తుదిదశలో పీహెచ్‌సీ నిర్మాణం

- అందనున్న మెరుగైన వైద్యం
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.52కోట్లతో భవనం
- పూర్తికావస్తున్న పనులు



దహెగాం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

దహెగాం: మారుమూల గ్రామాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తోంది. అదే క్రమంలో 15వ ఆర్థిక సంఘం కింద నిధులను విడుదల చేసింది. ఆ నిధులు విడుదల చేయడంతో పాటు పనులు కూడా చకచకా కొనసాగుతున్నాయి. మరో నెల రోజుల్లో భవన నిర్మాణ పనులు పూర్తి కానుండడంతో మండల వాసులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

రూ.1.52కోట్లు మంజూరు..

మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ప్రజలు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పైకప్పు ఉరుస్తున్నందున ఆస్పత్రికి వచ్చే రోగులు సైతం అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వం శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవన నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం కింద రూ.1.52 కోట్లు ఆరు నెలల క్రితం మంజూరు చేసింది.

పనులు ప్రారంభించిన అధికారులు ప్రస్తుతం వేగవంతంగా కొనసాగిస్తున్నారు. భవనం పూర్తి కాగా కిటికీలు, తలుపులు బిగించాల్సి ఉంది. అదే విధంగా టైల్స్ వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అదేవిధంగా వైద్యాధికారి ఉండడానికి సైతం పక్కనే క్వార్టర్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. రాత్రి వేళల్లో కూడా అత్యవసర సేవలు అందనున్నాయి. దీంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెలరోజుల్లో పూర్తి

మండల కేంద్రంలో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం కింద రూ.1.52కోట్లు మంజూరు కాగా పనులు ప్రస్తుతం వేగంగానే కొనసాగుతున్నాయి. మరో నెల రోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. పూర్తి అయితే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. – రాజ్‌కుమార్ జేఈ

గ్రంథాలయ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం పట్టణ కార్యదర్శి ఆనంద్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆనంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని, నూతన గ్రంథాలయాన్ని నిర్మించాలని పేర్కొన్నారు. వేలాది మంది విద్యార్థులు పోటీ పరీక్షల కోసం సిద్ధమయ్యేందుకు వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. గతంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆశ కార్యకర్తల సమ్మె

ఆసిఫాబాద్అర్బన్: ఆశ వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రారంభించిన నిరవధిక దీక్షలు శుక్రవారానికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమ్మె డిమాండ్లను యూనియన్ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన ఆశవర్కర్లను డబ్ల్యూహెచ్‌వో గుర్తించి గ్లోబల్ లీడర్స్ అని అవార్డును ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని వివరించారు. ఆశలకు ఫిక్స్‌డ్ వేతనంగా రూ.18వేలు ఇవ్వా లని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ని ఇవ్వాలన్నారు. ఆశా యూనియన్ రాష్ట్ర నాయకత్వంతో ప్రభుత్వం చర్చలు జరిపి డిమాండ్ల పరిష్కారానికి కార్యాచరణ తీసుకోవాలని పేర్కొన్నారు. నాయకులు స్వరూప, లావణ్య, సత్యశీల, సుమిత్ర, శ్యామల, సురేఖ, రేణుక, రాణి పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో ఆశ వర్కర్లు

కాగజ్‌నగర్‌టౌన్: ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలు వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన

దహెగాం: డిమాండ్ల సాధనకు మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం 9వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో దుకాణాల వద్ద భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన వేతనాల చెల్లింపునకు బడ్జెట్ విడుదల చేయాలన్నారు. కొత్త మెనూను సవరించాలని సూచించారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పార్వతి, పద్మ, శ్రీలత, గౌరమ్మ, మధునక్క, సరోజన పాల్గొన్నారు.



దహెగాంలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

ఖాళీ ప్లేట్లతో కార్మికుల నిరసన

రెబ్బెన: మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఖాళీ ప్లేట్లతో బైటాయించి నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులు మాయ, పోసుబాయి, తానుబాయి, లక్ష్మి, హసీనా, విజయ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణం సర్‌సిల్క్‌లోని పోచమ్మ ఆలయం నుంచి దాదానగర్ చౌరస్తా వరకూ మంజూరైన సీసీ రోడ్డు పనులకు జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం పోచమ్మ ఆలయం నుంచి ఇండియన్ గ్యాస్ గోదాం వరకు స్టోమ్‌వాటర్ డ్రైన్, సాయి మోక్షధామ్ నుంచి రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు, అలాగే రూ.10 లక్షలతో చింతగూడ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి సైతం భూమి పూజచేశా రు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీ ఆర్ పట్టణ ప్రజలకు రవాణ సౌకర్యం కల్పించేలా రోడ్లను మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, సంజయ్ సింగ్ ఠాకూర్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్

అభివృద్ధి పనులకు భూమిపూజ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నాగంపేట, రాస్పెల్లి, సారసాల గ్రామాల్లో మంజూరైన సీసీ రోడ్లకు జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు భూమిపూజ చేశారు. మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. గ్రామీణ క్రీడాకారులకు క్రీడా సామగ్రి కిట్లను అందజేశారు. ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, నాయకులు వాసుదేవు, రామయ్య ఉన్నారు.

అర్హులకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలి

రెబ్బెన: అర్హులకే గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని కై రిగూడ సర్పంచ్ అజ్మీర సంధ్యారాణి ఆరోపించారు. కై రిగూడ పంచాయతీలో కనీసం సర్పంచ్‌కు సమాచారం లేకుండా గ్రామసభ నిర్వహించకుండానే ఇళ్ల కేటాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని చెప్పారు. కైరిగూడలో ఎలాంటి గ్రామసభ నిర్వహించకుండా కనీసం గ్రామ సర్పంచ్ అయిన తనకు సమాచారం లేకుండానే ఇళ్ల కేటాయించారన్నారు. ఇళ్లు లేని నిరుపేదలను కాదని బీఆర్ఎస్ కార్యకర్తలకు, పార్టీ నాయకులకే గృహలక్ష్మి ఇళ్లను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసనలో సర్పంచ్

వైద్య కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుపెట్టాలి

బెజ్జూర్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా ప్రారంభమైన ప్రభుత్వ వైద్య కళాశాలకు దివంగత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని పద్మశాలి సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అచ్యుత్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు సామల తిరుపతి, ప్రధాన కార్యదర్శి కనుకట్ల వెంకటేష్ మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ కోసం పదవులు త్యాగం చేసిన మహనీయుడు లక్ష్మణ్ బాపూజీ అని తెలిపారు. వైద్య కళాశాలకు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ నామకరణం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అవధూత సత్యనారాయణ, తేలి రాజేష్, ఇప్పకాయల శంకర్, పర్శ గణేష్, పర్శరమేష్, దోమల అనిల్, బిట్టి నాగేష్, మల్లెల శ్రీకాంత్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

ఇష్టపడి చదివితే కొలువు సులభం



సన్మానిస్తున్న జర్నలిస్టులు



కపిల్‌ను సన్మానిస్తున్న సీఐ, లైబ్రేరియన్

వాంకిడి: ఇష్టంతో చదివితే అనుకున్న రంగంలో కొలువు సాధించడం సులభమని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఇటీవల వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికైన మండలానికి చెందిన దుర్గం కపిల్(సివిల్), శ్రీరాం సాయి ప్రణీత్(టీఎస్ఎస్పీ), సాయితేజ (సిఐఎస్ఎఫ్)లను మండల గ్రంథాలయంలో లైబ్రేరియన్ సదానందంతో కలిసి సన్మానించారు. సీఐ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న గ్రంథాలయం నిరుద్యోగులకు వరంగా మారిందని, కోచింగ్‌లకు వెళ్లకుండా అన్నీ సౌకర్యాలతో ఉన్న గ్రంథాలయంలోనే చదువుకుని కొలువు సాధించడం గొప్ప విషయని కొనియాడారు.

ఆసిఫాబాద్‌రూరల్: పోలీసు కానిస్టేబుల్‌కు ఎంపికైన మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన తుల్సిరాంను శుక్రవారం ఛత్రపత్రి శివాజీ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారుడు బెంబ్రే సదానందం మాట్లాడుతూ జర్నలిస్టుగా సేవలు అందించి ప్రస్తుతం పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిక్కాజీ, కోశాధికారి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు జానకిరాం, మహేష్, కిరణ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళలకు జెడ్పీటీసీ సముద్రాల సరిత శుక్రవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ కానుకగా చీరలను పంపిణీ చేస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో మహిళల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల కమల, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటి, వార్డు సభ్యులు తిరుపతి, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అర్చన, నాయకులు రాజన్న, సీఏ రోజా పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌రూరల్: చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మహిళలకు బతుకమ్మ చీరలను జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అందించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో 17వేల40 చీరలను పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్, ఆడెపల్లి, దిందా, ఖర్జవెల్లి తదితర గ్రామాలలో శుక్రవారం బతుకమ్మ చీరల పంపిణీ నిర్వహించారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య మహిళలకు చీరలను అందజేశారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మనోజిత్ మండల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, సర్పంచ్ నానయ్య ఉన్నారు.



చింతలమానెపల్లి: చీరలు అందిస్తున్న ఎంపీపీ

ఆసిఫాబాద్‌రూరల్: బతుకమ్మ చీరాలను అందిస్తున్నట్లు జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలో అంకుసాపూర్, ఎల్లారం గ్రామాల్లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఎంపీపీ మల్లికార్జున్, సర్పంచ్ సీతారాం పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ చీరల పంపిణీ

ఆసిఫాబాద్అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరలను నేడు జిల్లా కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఉదయం 11గంటలకు పంపిణీ చేయనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ ప్రకటనలో తెలిపారు. తమ వెంట రేషన్‌కార్డును తీసుకు రావాలని సూచించారు.

బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పత్రిక స్వేచ్ఛపై దాడికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ కుమురంభీం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.భీమేష్ మాట్లాడుతూ మీడియాపై బీజేపీ దాడిని ఆపకపోతే ఉద్యమిస్తామని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను నిరంతరం ఎండగడుతూ, ప్రజలకు చేరువచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా న్యూస్‌క్లిక్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పుర్కయస్థ, హెచ్ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిలను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న అశోక్

జైనూర్: ఆపదలోని వారికి రక్తదానం చేయడంతో వారి ప్రాణాలు కాపాడిన వారమవుతామని సాయిదీపం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వైద్యాధికారి నాగర్గోజే అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 50మంది దాతలు రక్తదానం చేశారు. ఫౌండేషన్ తరఫున గిత్తే రవి నాలుగు ఫ్యాన్లు, డాక్టర్ హైదర్ వాటర్ ప్యూరిఫైర్ మిషన్, షఫి ఒక ఫ్యాన్ ప్రభుత్వాసుపత్రికి విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో జైనూర్, జామిని యువకులు తదితరులున్నారు.

ఆర్థిక అవగాహన కలిగి ఉండాలి

కౌటాల: ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కౌటాల శాఖ మేనేజర్ నర్సింహస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగెపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎం.వి. రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ఆధ్వర్యంలో సామాజిక భద్రతా పథకాలైన ప్రధాన మంత్రి సురక్షా యోజన, జీవనజ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన లాంటి పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ పథకాల ద్వారా ప్రజలు ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. బ్యాంక్‌లకు సంబంధించిన ఖాతా నంబర్లు, పిన్ నంబర్లను, సంబంధం లేని వారికి తెలుపవద్దని సూచించారు. ఆర్థిక పరమైన సందేహాలకు బ్యాంకులో సంప్రదించాలని సూచించారు. కళాబృందం సభ్యులు విష్ణు, చిరంజీవి, బ్యాంకు సిబ్బంది మనోహర్, రాజేష్, సర్పంచ్ జ్యోతిరావు, మహిళా సంఘాల అధ్యక్షురాలు శారద పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ నర్సింహస్వామి

సమసమాజ సాధనే కేవీపీఎస్ లక్ష్యం

ఆసిఫాబాద్అర్బన్: ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అనే ఆశయం కోసం మహాత్మాజ్యోతిబాపులే, భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనే కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కేవీపీఎస్ పోరాడుతోందని జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ పేర్కొన్నారు. కేవీపీఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి వేడుకలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 25ఏళ్ల ప్రస్థానంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు నడిపి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సాధించేందుకు ప్రధాన భూమిక పోషించిందని, జస్టిస్ పున్నయ్య కమిషన్ శ్మశానవాటిక స్థలాల జీవో నం.1235 సాధించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మస్కు, నాయకులు నాగేష్, డోంగ్రి, మహేశ్వర్, జాడి రామయ్య, సోమేశ్వర్, విలాస్ పాల్గొన్నారు.



కేవీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అభివృద్ధికి ఆమడ దూరంలో గ్రామాలు

- బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సోయం చిన్నయ్య

పెంచికల్‌పేట్: మండలంలోని మారుమూల గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని బీఎస్పీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సోయం చిన్నయ్య విమర్శించారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలియచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నేటికి జూనియర్ కళాశాల మంజూరు చేయలేదని, దీంతో పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక అత్యవసర పరిస్థితుల్లో అనేక అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి రాంప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షురాలు విజయనిర్మల, మండల అధ్యక్షుడు రామిళ్ల దేవాజీ ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

సుస్థిర వ్యవసాయంతో మంచి దిగుబడులు

తిర్యాణి: సుస్థిర వ్యవసాయంతో మంచి దిగుబడులను సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి తిరుమలేశ్వర్ అన్నారు. క్రిషి మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చింతపెల్లి, మంగి, మాణిక్యపూర్, గిన్నెదరి, పండిడిమాదర రైతు వేదికలో పంటల సాగుపై నిర్వహించిన కార్యక్రమం ఆయన మాట్లాడారు. మండలంలో రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసి రైతులను ఆర్థికంగా సముచిత స్థానం కల్పించడమే లక్ష్యంగా నీతి ఆయోగ్ పనిచేస్తుందన్నారు. ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపెల్లి శాస్త్రవేత్తలు శివకృష్ణ, నాగరాజు, పశు వైద్యుడు రామకృష్ణ ఉన్నారు.



మాట్లాడుతున్న ఏవో తిరుమలేశ్వర్